# ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయము, విజయవాడ.

**పత్రికా ప్రకటన.** **తేదీ. 03.09.2025.**

**ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు...అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు......ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.యస్ గారు**

**ఈ తనిఖీలలో మూడు కేసులు నమోదు**

ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనుల నేపథ్యంలో ఎరువులు, పురుగు మందులకు ఉన్న అధిక డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని, కొంతమంది వ్యాపారులు యూరియా నిల్వలు చేసి కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో ముందస్తుగా పోలీస్ శాఖ అప్రమత్తమై అన్ని షాపులలో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది.

ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. గారి ఆదేశాల మేరకు, డి.సి.పి.గార్ల పర్యవేక్షణలో ఏ.సి.పిలు, సీఐలు, ఎస్ఐలు మరియు వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో ఎన్.టి.ఆర్. జిల్లాలోని ఎరువుల దుకాణాలు, ఎరువుల గూడౌన్స్, PACS గూడౌన్స్, బోర్డర్ చెక్ పోస్టుల వద్ద మరియు పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్టాక్ నమోదు, పీఓఎస్ (PoS) యంత్రాల్లో నమోదైన వివరాలు, పంపిణీ రిజిస్టర్లు, విక్రయ పత్రాలను అధికారులు సమగ్రంగా పరిశీలించడం జరిగింది. ఎన్.టి.ఆర్.జిల్లాలో యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి, అవి బ్లాక్ మార్కెట్‌కి వెళ్లకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అదేవిధంగా జిల్లాలో యూరియా అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది.

దుకాణాల్లోని వాస్తవ నిల్వలు మరియు పీఓఎస్ (PoS) యంత్రాల్లో నమోదైన స్టాక్ మధ్య తేడాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు, ఎరువుల నిల్వలు మరియు పంపిణీ విధానాలను నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో

బాగంగా ఏ.కొండూరు, గంపలగూడెం మరియు తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలలోని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేయడం జరిగింది.

ప్రతి ఎరువుల దుకాణం తమ స్టాక్ వివరాలను పీఓఎస్ (PoS) యంత్రంలో ఖచ్చితంగా నమోదు చేయాలని, వాస్తవ నిల్వలు మరియు రికార్డుల మధ్య ఎటువంటి తేడాలు ఉండకూడదని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి తేడాలు ఉంటే, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పి (గరిష్ట చిల్లర ధర)కి మించి అదనంగా విక్రయించరాదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని, సహృదయంతో వ్యవహరించి వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని హితవు పలికారు. రైతులు మోసపోకుండా ఉండేందుకు, ప్రతి ఎరువుల బస్తా విక్రయానికి రసీదు ఇవ్వాలని, ఎరువులు, పురుగుమందుల విషయంలో ఏవైనా అక్రమాలు జరిగినట్లు గమనిస్తే, వెంటనే ప్రజలు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లా కలెక్టర్ గారు, పోలీస్ కమీషనర్ గారు సంబంధిత శాఖల సమన్వయంతో ఒక కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేసారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.

ఈ ఆకస్మిక దాడులు వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచేందుకు, బ్లాక్ మార్కెట్ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

* * *